మార్కెట్‌లో దీపావళి సందడి

- పట్టణంలో టపాసుల అమ్మకాలు
- మార్కెట్‌లో పూజసామగ్రి విక్రయాలు
- రంగురంగుల దీపాలతో అలంకరణలు



సిరిసిల్లటౌన్: ఆనందకేళి..దీపావళి పండుగ సందర్భంగా పట్టణంలోని అన్ని వ్యాపార సంస్థలు ఆదివారం సందడిగా మారాయి. పండుగ సందర్భంగా నిర్వహించే మహాలక్ష్మి, కేదారేశ్వర పూజల కోసం అవసరమైన సామగ్రి, పూజా ద్రవ్యాలు, అరటి పత్రాలు, మామిడాకుల తోరణాలు, కొబ్బరిఆకులతో ఆయా వ్యాపార సంస్థల ఎదురుగా స్వాగత తోరణాలు నిర్మించడం ప్రతీతి. ప ట్టణం లోని అన్ని వాణిజ్య, వ్యాపార సంస్థలను విద్యుత్ దీపాలతో కూడిన తోరణాలతోనూ అలంకరించారు. ఒకరోజు ముందే సిరిసిల పట్టణం నరకచతుర్థి(భోగి), దీపావళి శోభను సంతరించుకుది.

పట్టణంలో పండుగ శోభ

దీపావళి అమ్మకాలతో పట్టణంలో మార్కెట్‌కు పండుగశోభ సంతరించుకుంది. కొబ్బరికాయలు, ప్రసాద సామగ్రి, ప్రమిదలు, పటాకులు, అరిటాకులు, కొబ్బరిమట్టలు, గుమ్మడికాయలు తదితర వస్తువుల కొనుగోళ్లతో మార్కెట్ బిజీగా మారిపోయింది. స్థానికంగా తయారైన వాటితో పాటు అంతరాష్ట్రాల నుంచి దిగుమతైన ప్రమిదలు ఆకర్షణీయమైన డిజైన్లతో ఆకట్టుకుంటున్నాయి. వివిధ వ్యాపార, వాణిజ్య, గృహ సముదాయాలు విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. వ్యాపార, వాణిజ్య సంస్థలతో పాటు చిన్న, పెద్ద అన్ని రకాల దుకాణాల్లో లక్ష్మీ పూజల కోసం గుమ్మడికాయలు, అన్నిరకాల పూలు, పండ్లు, స్వీట్లు కొనుగోళ్లు చేశారు. టపాసుల దుకాణాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.







క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కోనరావుపేట: ఈనెల 26, 27న జరిగే మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు.మండలకేంద్రంలో ఆదివారం మధ్యాహ్న భోజన కార్మికుల మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ. 10 వేలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ఇప్పటికీ 22 నెలలు కావస్తున్నా హామీని అమలు చేయడం లేదన్నారు. వెంటనే మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంల్లో జిల్లా కార్యదర్శి గురిజాల శ్రీధర్, మధ్యాహ్న భోజన కార్మికులు మ్యాకల కవిత, బాల మణి, రాధ, పద్మ, దేవవ్వ, శంకరవ్వ, సంధ్య తదితరులు పాల్గొన్నారు

రాజన్న ఆలయంలో కొనసాగుతున్న పనులు



వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల నేపథ్యంలో క్రమంలో ఆలయంలో వేసిన పైకప్పు రేకులను ఆలయ అధికారులు తొలగించారు. దీంతో ఆదివారం ఆలయం లోపలి నుంచి స్వామివారి గోపురాలు స్పష్టంగా కనిపించాయి. మరి కొద్ది రోజుల్లో ఇందుకు సంబంధించిన షెడ్డులను తొలగించనున్నారు.

ఎమ్మెల్యే సత్యంను కలిసిన గౌడసంఘం సభ్యులు



ఎమ్మెల్యే సత్యంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న గౌడ సంఘం సభ్యులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన గౌడ సంఘం సభ్యులు ఆదివారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మండల కేంద్రంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని పునర్ నిర్మాణం చేస్తున్నామని, తనవంతు నిర్మాణానికి సహకారం అందించాలని కోరారు. ఆలయ నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహకారం అందజేస్తామన్నారు. గౌడ సంఘం మండల అధ్యక్షుడు గంట కార్తీక్‌గౌడ్, సభ్యులు పందిర్ల లింగంగౌడ్, బుచ్చిలింగ్ సంతోష్‌గౌడ్, గంట దేవయ్య, గంట రమేశ్ గౌడ్ తదితరులున్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

చందుర్తి: మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో మై భారత్, జిల్లా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మండలస్థాయి కబడ్డీ, వాలీబాల్, షటిల్, చెస్, రన్నింగ్ పోటీలను నిర్వాహకులు పోంచెట్టి రాకేశ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాకేశ్ మాట్లాడుతూ యువతకు క్రీడలపై ఆసక్తి పెంచేందుకు మండలస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత క్రీడల్లో రాణించాలన్నారు. ఈ పోటీల్లో ప్రతిభను కనబర్చిన క్రీడాకారులకు ప్రోత్సాహ బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చందుర్తి సింగిల్ విండో మాజీ చైర్మన్ తిప్పని శ్రీనివాస్, నాయకులు పులి సత్తయ్య, చిలుముల హనుమయ్యాచారీ, మట్కం మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు



కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లి గ్రామ శివారులో హన్మాజీపేటకు వెళ్లే ప్రధాన రహదారిపై రోడ్డు గుంతలుగా తయారైంది. ఈ దారిన వెళ్లే వాహనదారులు కొన్ని రోజులుగా ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఏఎంసీ డైరెక్టర్ సాసాల మల్లారెడ్డి సొంత ఖర్చులతో గుంతలుపడిన రహదారిపై మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డిని గ్రామస్తులు, వాహనదారులు అభినందించారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



నారాయణపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని ఏఎంసీ చైర్మన్ సాబేరా బేగం, సింగిల్‌విండో చైర్మన్, జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని నారాయణపూర్‌లో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ధాన్యం డబ్బులు నేరుగా రైతుల ఖాతాల్లో జమచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ నిమ్మ లక్ష్మీ, సింగిల్‌విండో డైరెక్టర్లు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ కవాతు



బోయినపల్లి: మండలంలోని విలాసాగర్‌లో ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు కవాతు నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో కరీంనగర్ విభాగ్ సహ వ్యవస్థ ప్రముఖ్ దావులూరి మురళిధర్ జీ మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు


వేములవాడ: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ కనెక్షన్ లేని నిరుపేద కుటుంబాలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్ అందించాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్ అందిస్తోందని భువనేశ్వరి ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్యాస్ కనెక్షన్ లేని పేద కుటుంబాలకు చెందిన లబ్ధిదారులు తెల్ల రేషన్‌కార్డు, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు, యజమానురాలి బ్యాంకుఖాతా, నాలుగు ఫొటోలు, ఫోన్ నంబర్‌తో పట్టణంలోని తమ శాఖను సంప్రదించాలని కోరారు.

సన్మానం



బోయినపల్లి: కుర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎగ్గె మల్లేశంను జిల్లా కుర్మసంఘం అధ్యక్షుడు ఏనుగుల కనుకయ్య, బోయినపల్లి సంబ లక్ష్మిరాజం తదితరులు ఆదివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.జిల్లాలో కుర్మ సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాల గూర్చి రాష్ట్ర అధ్యక్షుడికి కనుకయ్య, లక్ష్మిరాజం వివరించారు. అనంతరం ఘనంగా సన్మానించారు.

వేములవాడ సమాచారం



వేములవాడ రాజన్న సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి కొనసాగింది. సాయంత్రం 4 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	07	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	29	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	02	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	01	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	08	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	25	560
నందీశ్వర సూట్స్	04	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	15	448
పార్వతీపురం స్పెషల్	14	672
పార్వతీపురం సాధారణ	13	336

– వేములవాడ

వీధి కుక్కలతో బెంబేలు



ముస్తాబాద్‌లో రోడ్డుపై సంచరిస్తున్న కుక్కలు

ముస్తాబాద్: మండలకేంద్రంలో వీధికుక్కల బెడద ఎక్కువైంది. గుంపులుగా తిరుగుతున్న కుక్కలు దారి వెంట వెళ్లేవారిని భయాందోళనకు గురిచేస్తున్నాయి. వాహనదారులను, కాలినడకన వెళ్లేవారిని వెంబడిస్తుడటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ముస్తాబాద్ మార్కెట్ ఏరియా, దుబ్బాక దారి, పోతుగల్ రహదారిలో పెద్ద సంఖ్యలో కుక్కలు ఉన్నాయి. ముఖ్యంగా చికెన్, మటన్ షాపుల వద్ద కుక్కలు రోడ్లపైనే ఉండడంతో పలువురు ఇప్పటికే ప్రమాదాల బారినపడ్డారు. పలువురికిపై దాడిచేశాయని సింగిల్‌విండో డైరెక్టర్ పెంజర్ల బాలెల్లు తెలిపారు. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరుతున్నారు.

అసంపూర్తి పనులతో అవస్థలు

- మండలకేంద్రంలో సీసీరోడ్డు వేసి డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులు మరిచిన అధికారులు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



ఈ చిత్రంలో కనిపిస్తున్న ప్రమాదకర మూలమలుపు పాత గ్రామపంచాయతీ, మద్దిమల్ల బస్టాండ్ ప్రాంతంలోనిది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకుండా ఉండదంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



వీర్నపల్లిలో సీసీరోడ్డు మధ్యలో డివైడర్ నిర్మించకపోవడంతో గుంతల్లో నిలుస్తున్న నీరు

వీర్నపల్లి: మండలకేంద్రంలో పలు అభివృద్ధి పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పాలకులు, అధికారులు మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని హామీలు ఇచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ఎల్లారెడ్డిపేట నుంచి వీర్నపల్లి మండలకేంద్రంలోని గర్జనపల్లి శివారు వరకు వంతెనలు, సీసీరోడ్లు, బీటీరోడ్ల నిర్మాణానికి గత ప్రభుత్వం హయాంలో రూ.49కోట్లు మంజూరుచేశారు. మండలంలో సీసీరోడ్లు, సెంట్రల్ లైటింగ్‌తోపాటు పలు అభివృద్ధి పనులుచేపట్టగా మధ్యలోనే నిలిచిపోయాయి. పనులు వెంటనే పూర్తిచేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నిలిచిన డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులు

వీర్నపల్లి మండలకేంద్రలోని ఫారెస్ట్ గెస్ట్‌హౌస్ నుంచి కొత్తబస్టాండ్ వరకు కిలోమీటర్ వరకు సీసీరోడ్డు నిర్మించారు. డివైడర్ నిర్మించకపోవడం, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టకపోవడంతో మధ్యలో గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. బస్టాండ్ నుంచి పాత తహసీల్దార్ కార్యాలయం వరకు మరో కిలోమీటర్ సీసీరోడ్డు కోసం కంకరపోసి మధ్యలోనే వదిలేశారు.

పనులు చేయడం లేదు



ఎన్నికల సమయంలో నాయకులు సెంట్రల్ లైటింగ్, డివైడర్, రోడ్లు వేస్తామని హామీలు ఇచ్చినా ఇప్పుడు పనులు చేయడం లేదు. మండలంలో చేపట్టిన పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. అధికారులు పనులు పూర్తిచేసి ఇబ్బంది లేకుండా చూడాలి. – తవుటు అశోక్, వీర్నపల్లి

వసతులు లేక ఇబ్బంది



మండలంలో మౌలిక వసతులు లేక ఇబ్బంది పడుతున్నాం. నాయకులు, అధికారులు అభివృద్ధి పనులు చేస్తామని పట్టించుకోవడం లేదు. మండల కార్యాలయాలకు సొంత భవనాలు, ప్రజలకు అందుబాటులో విద్య,వైద్యం అందించాలి. – రాయిని బుగ్గయ్య, రంగంపేట



బోయినపల్లి: మండలకేంద్రం నుంచి విలాసాగర్ వెళ్లేరోడ్డులో మర్లపేట పరిసరాల్లోని వరద కాలువ దాటిన తర్వాత రోడ్డుపై పెద్ద గుంతపడింది. రోడ్డుమధ్యలో గుంత ఉండదంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

– జువ్వెంతుల శ్రీనివాసరెడ్డి, మర్లపేట

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
సాయితేజ, పీఆర్, ఏఈఈ బోయినపల్లి, సెల్: 9849781096

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

బీసీ రిజర్వేషన్లు సాధించేవరకూ ఉద్యమం



ఆవునూర్‌లో సమావేశమైన బీసీ జేఏసీ నాయకులు

ముస్తాబాద్: బీసీ రిజర్వేషన్లు సాధించుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందని ఆవునూర్ బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు మిర్యాల్‌కార్ శ్రీనివాస్, అధ్యక్షుడు నక్కదాసరి రవీందర్ అన్నారు. ఆవునూర్‌లో 14 బీసీ సంఘాల ఐక్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరో తెలంగాణ ఉద్యమంలా బీసీల ఉద్యమం చేపట్టాల్సిన అవసరముందన్నారు. ఈ సందర్భంగా గ్రామ బీసీ జేఏసీని ఏర్పాటు చేశారు. గౌరవాధ్యక్షుడిగా మిర్యాల్‌కార్ శ్రీనివాస్, అధ్యక్షుడిగా నక్కదాసరి రవీందర్, ఉపాధ్యక్షులుగా పిట్ల రాజు, బండి ఆశయ్య, బషీర్, శాగ ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా జవ్వాజి బాలకృష్ణ, కార్యదర్శులుగా జవ్వాజి చంద్రశేఖర్, శివచందు, కాసారపు శ్రీకాంత్, గోపన్నగారి వెంకటరాజు, కోశాధికారిగా బందెల నర్సయ్య, బైరి శ్రీనివాస్ తదితరులు ఎన్నికయ్యారు. మరో పది మందిని సలహాదారులుగా ఎన్నుకున్నారు.

కల్లాల వద్దే మక్కలు కాంటా



ముస్కానిపేటలో కల్లాల వద్ద మక్కలు అమ్ముకుంటున్న రైతులు

- మద్దతు ధర కోల్పోతున్న రైతులు
- కొనుగోలు కేంద్రం లేక దళారులకు విక్రయం

ఇల్లంతకుంట: వర్షానికి పంట పాడవుతుందేమోనన్న భయంతో మొక్కజొన్న రైతులు తక్కువ ధరకే దళారులకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవదంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. స్థానికంగా మార్కెట్ లేకపోవడంతో మండలంలోని రైతులు తాము పండించిన మొక్కజొన్న పంటను విక్రయించేందుకు కరీంనగర్, సిద్దిపేట, సిరిసిల్ల పట్టణాలకు వెళ్తున్నారు. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2400 మద్దతు ధర ప్రకటించగా ప్రైవేట్ వ్యాపారులు మాత్రం రూ.1950 మాత్రమే చెల్లిస్తున్నారు. రైతులు ఒక క్వింటాల్‌పైనే ఏకంగా రూ.450 నష్టపోతున్నారు. ఇల్లంతకుంట మండలంలోని ముస్కానిపేట, రేపాక, దాచారం, గాలిపెల్లి, ఇల్లంతకుంట గ్రామాల్లో 600 ఎకరాల వరకు మొక్కజొన్న పంట సాగుచేశారని వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి తెలిపారు. మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కొంతకాలంగా రైతులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

వర్షం పడితే పాడవుతాయనే



నేను మూడు ఎకరాల మొక్కజొన్న సాగుచేసిన. వర్షాలకు భయపడి పంటను ప్రైవేటు వ్యాపారులకు అమ్మేసిన. క్వింటాలుకు రూ.1950 ధర పెట్టింద్రు. ఇల్లంతకుంటలో ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు లాభం జరుగుతుంది. వరి, పత్తి తర్వాత మండలంలో మొక్కజొన్న పంటనే ఎక్కువగా సాగవుతుంది.

– గుర్రం నరసింహారెడ్డి, ముస్కానిపేట

చైన్ స్నాచింగ్ నిందితుల అరెస్ట్

కోనరావుపేట: చైన్‌స్నాచింగ్ కేసులో మండలంలోని నిమ్మపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు అరెస్ట్ అయినట్లు తెలిసింది. సిద్దిపేట పోలీసులు తెలిపిన వివరాలు. ఈనెల 17న ఉదయం 5 గంటలకు భవిత అనే మహిళ సిద్దిపేటలోని కోమటిచెరువు వైపు వాకింగ్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన సామల బాలకిషన్ ఉరఫ్ రిషి ఉరఫ్ కిషన్, పూజం రాకేశ్ స్కూటీపై వెంబడించి ఆమె మెడలోని బంగారు చైన్ లాక్కుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదుతో నిందితుల కోసం పోలీసులు గాలింపు చేపట్టగా బుధవారం ఒక ఇంట్లో నుంచి బయటకు వస్తుండగా పట్టుకున్నారు. నిందితులు గతంలో కోనరావుపేట పరిధిలో మోటార్లు దొంగతనానికి పాల్పడ్డారు. బాలకిషన్ సిరిసిల్లలోని ఓ హత్యకేసులో నిందితుడు. వీరి టీమ్‌లోని మరొకరు మంగళారపు మాధవితో కలిసి హైదరాబాద్‌లోని ఎండీ అఫ్జల్‌కు బంగారు నగలును అమ్మి రూ.1.70 లక్షలు తీసుకున్నట్లు విచారణలో తేలింది. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట వన్‌టౌన్ ఎస్సై శ్రీనివాసరెడ్డి తెలిపారు.

కానిస్టేబుల్ మృతికి నివాళి

చందుర్తి: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సీసీఎస్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రమోద్ మృతి పట్ల మండలకేంద్రంలోని క్రీడాకారులు ఆదివారం నివాళి అర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు.

విజయవంతం చేయండి



ఎల్లారెడ్డిపేట: ఈనెల 26న వేములవాడలోని గుమ్మి పుల్లయ్య భవన్‌లో నిర్వహిస్తున్న ఏఐటీయూసీ జిల్లా నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, మిడ్ డే మీల్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆదివారం మహాసభ కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులు పెద్ద సంఖ్యలో మహాసభకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘాలు ముందుండి పోరాడుతున్నాయన్నారు. నాయకులు అజ్జు, దేవవ్వ, లక్ష్మీ, స త్తవ్వ, రాజవ్వ, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.